# అమ్మ చెప్పిన మాట

మధ్యాహ్నం నేను భోంచేస్తున్న సమయంలో సరోజిని వచ్చింది.

"భోంచేస్తావా?" అని అడిగాను.

"వద్దు. తినే బయలుదేరాను. మరీ ఇంత ఆలస్యంగా భోంచేస్తున్నావేమిటీ?" అంది. "పనులు తెమిలేసరికి ఆలస్యమైంది." భోజనం ముగించి లేచాను.

"అమ్మ ఏం చేస్తోంది?" అని అడిగింది.

"ఇప్పుడే పడుకుంది."

"ఈ గదిలోనేగా" అంటూ లోనికి వెళ్ళింది. వెంటనే ముక్కుకు గుడ్డ అడ్డం పెట్టుకుంటూ ఇవతలకి వచ్చింది.

"అబ్బా చెడ్డవాసన, శుభ్రంగా ఫినాయిల్ పెట్టి కడిగించకపోయావా?" అంది.

"రోజుకు రెండుసార్లు తుడిపిస్తూనే ఉన్నాను. తనకు రోజూ స్పాంజీబాత్ ఇచ్చి బట్టలు మారుస్తుంటారు."

"అన్నీ పడకలోనే కదా!"

"అయినా అప్పటికప్పుడు శుభ్రం చేయిస్తుంటాను. కొన్ని జబ్బుల వల్ల శరీరం నుండి దుర్గంధం వస్తుందనుకుంటా."

ఇంకేం తక్కువలేదన్నట్టు తలతిప్పింది. "అబ్బ ఎలా భరిస్తారో ఏమో! నాకైతే ఒక నిమిషానికే కడుపులో తిప్పేసింది" అంది ముఖం చిట్లించుకుంటూ.

సరోజిని చిన్నప్పటినుంచీ అంతే ఏ మాత్రం రోత భరించలేదు. మా చిన్నతనంలో ఒకసారి అమ్మచేతికేదో అయింది. కాలిందో, గాయమైందో తెలీదు. ఆ చేతుల్తో స్నానం చేయిస్తానంటే సరోజిని ఒప్పుకొనేది కాదు. ఏడ్చి రాగాలు పెట్టేది. అమ్మ ఆ చేతికి ఏదో ఒకటి చుట్టుకొని తనను బుజ్జగించి, మాటలు చెప్పి నీళ్ళు పోసేది.

"నువ్వేం తీసుకుంటావు? కాఫీనా?" అని అడిగాను.

"యాక్. ఇప్పుడు కాఫీ తాగితే ఇక అంతే. నిమ్మకాయ ఉందా? నిమ్మరసం తాగుతాను. రసన, గిసన అని ఆర్టిఫిషియల్ నిమ్మరసాలు ఇవ్వకు."

నిమ్మరసం చేసి ఇచ్చాను. ఫ్రిజ్‌లో నుండి కేకు ముక్కలు తీసి పెట్టాను.

"కేకు వద్దులే. డాక్టర్ కాస్త బరువు తగ్గించమన్నాడు. బ్లడ్ ప్రెషర్ కదా."

"మరేం తింటావు? ఉప్మా చెయ్యనా?"

"ఇప్పుడేం వద్దులే. అమ్మలేచాకా"

"నీకు తెలుసుకదా, అమ్మ ఇటువంటివేవీ తినదని. రెండు రోజులుగా శరీరం వాచిపోయింది. నిన్న ఆస్పత్రికి కూడా తీసుకెళ్ళాం, అడ్మిట్ చేద్దామని. వాళ్లు ఇంటికి తీసుకుపొమ్మన్నారు."

"అవునూ ఆస్పత్రి ఖర్చులు, మందుల ఖర్చులూ బావగారి ఆఫీసే ఇస్తుందేమో?"

"ఎందుకిస్తుంది? అమ్మ మీ బావగారి కుటుంబంలోకి రాదుగా."

తనేం మాట్లాడలేదు.

"పిల్లలేరి? స్కూలుకు వెళ్లారా? అయినా కుమారి ఎక్కడికి పోతుందిలే. ఇంట్లోనే ఉండాలే.

"ఈ రోజు పిల్లలకు సెలవే. అటు పార్కుదాకా వెళ్లారు."

"కుమారిని కూడా పంపించావా?"

"చెల్లెళ్లు ఇద్దరూ ఉన్నారుగా. కాకపోయినా రాత్రింబవళ్లు ఇంట్లో ఉండే పిల్లకు కొంచెమైనా బయటి ప్రపంచం తెలియాలి కదా."

"కుమారికి ఏమి తెలుస్తుంది పాపం... దాని రాత అంతే. ప్చ్. చిన్న బిడ్డ కంటే అన్యాయమే."

నేనేం మాట్లాడలేదు. ఇవన్నీ ఇదివరకు లెక్కలేనన్నిసార్లు మాట్లాడుకొన్నవే. అన్ని సమస్యలకూ పరిష్కారాలుండవు. కొన్ని సమస్యలను అలాగే స్వీకరించాలి. వాటితోపాటు జీవించడం నేర్చుకోవాలి. రోజూ మన తలరాతను నిందించి, నిందించి, భగవంతుణ్ని స్మరించి, స్మరించి ఆ సమస్యను తలపోసి, తలపోసి చేసేదేముంది? "విశ్వం ఎలా ఉన్నాడు? రాజా, రఘు ఎలా ఉన్నారు? ఇక్కడికి రావటమే మానేశారు" అంటూ మాట మార్చాను.

"అందరూ బాగున్నారు. వాళ్ల వాళ్ల పనుల్లో బిజీ. నేనూ ఆఫీసునుండే వస్తున్నా" అంటూ చీర కాస్త సర్దుకు కూర్చుంది. అప్పుడు జిగేల్మనేలా తన వేలి ఉంగరం మెరిసింది. నా చూపు పసిగట్టినట్టు "మొన్న వెడ్డింగ్ యానివర్సరీకి విశ్వం ఇచ్చాడు. బాగుందా?" అంటూ చెయ్యి ముందుకు చాపింది. అది డైమండు ఉంగరం. తొమ్మిది వజ్రాలున్నాయి. సరికొత్త డిజైన్.

"చాలా బాగుంది" అన్నాను.

"ఉండదూ మరి. పదిహేను వేలు. ఒక్క ఉంగరమే ఇంత. ఇక మొత్తం సెట్ అంటే టాప్స్, పెండెంట్ కలిపి యాభైవేలు. తను కొనలేదనుకో. ప్రామిస్ అయితే చేశాడు, బర్త్ డే నాటికి తనకు ఎరియర్స్ వస్తాయన్నాడు," అంటూ నవ్వింది.

అంతలో అమ్మ దగ్గినట్లయింది. లోపలికి వెళ్లాను. ఏమైనా కావాలా అని అడిగాను.

"మంచినీళ్లు" అంది. ఇచ్చాను. "ఎవరో వచ్చారు" అంది. "సరోజిని" అన్నాను. అమ్మ మళ్లీ పడుకుంది.

"అమ్మ లేచిందా? నేను వచ్చినట్లు చెప్పావా?" అని అడిగింది సరోజిని.

"మళ్లీ పడుకొంది" అన్నాను.

"అంతేలే. నాతో మాట్లాడాలంటే ఆమెకు నిద్ర వస్తుంది. నువ్వున్నావుగా ముద్దుల కూతురివి, అందుకే అంతా నీకు దోచి పెడ్తుంది."

"అవేం మాటలే సరోజినీ! జబ్బుతో ఉంది. కొన ఊపిరితో ఉంది. తన గురించి ఇలాగేనా మాట్లాడేది? ఇంతకూ నాకేమి దోచి పెట్టింది? నీకివ్వని సంపద నాకేమిచ్చింది?"

"ఆరు నెలలుగా నీ దగ్గరే ఉందిగా. ఇంటిమీద వచ్చే అద్దె అంతా ఏమవుతున్నట్లు?" నిలదీస్తున్నట్లు ప్రశ్నించింది.

నాకు తలతిరిగినట్లయింది. కొడుకులులేని నా తల్లి ఒంటరిగా దీర్ఘవ్యాధితో బాధపడుతుంటే, చివరికి మంచాన పడితే ఆస్పత్రుల చుట్టూ తిరిగి, వైద్యం చేయించి తీసుకొచ్చి నా ఇంట్లో పెట్టుకున్నాను. ఆస్పత్రి, పరీక్షలు, మందులు... అంటూ నానా అవస్థలూ పడుతున్నాను. ఆ ఖర్చులకు కూడా ఒక మితం అంటూ లేదు. మురళి నాకు అండగా నిలవకపోతే నేనీ బాధ్యత నెత్తిన వేసుకోగలిగేదానినే కాదు. "పెద్దతనంలో జబ్బుపడినప్పుడు తల్లిదండ్రులను పిల్లలు చూసుకోకపోతే ఎవరు చూసుకుంటారు? కొడుకులు లేకపోతేనేం, మీరిద్దరు కూతుర్లున్నారు కదా! ఎవరో ఒకరు ఈ బాధ్యత తీసుకోవలసిందే" అన్నాడు మురళి.

సరోజినిని కలిసి అప్పుడే మాట్లాడాను. "ఇప్పుడేం చేద్దాం? అల్లుడింట్లో ఏ అత్తగారుంటారు? నలుగురూ ఏమనుకుంటారు?" అంది మొదట.

"ఈ కాలంలో ఎవరూ అలా ఆలోచించరు. కొడుకులైనా, కూతుళ్లైనా పిల్లలు పిల్లలే. మనం చూడకపోతే మన అమ్మని ఎవరు చూస్తారు?"

"నాకెక్కడ కుదురుతుంది సౌందర్యా? నేను, విశ్వం ఇద్దరం ఉద్యోగాలు చేస్తున్నాం. నాకున్నది ఇద్దరూ మగపిల్లలే. వాళ్లేం సాయం చేస్తారు? సరయిన పనివాళ్లు దొరక్క నా ఇల్లు నడుపుకోటమే నాకు కష్టంగా ఉంటుంది. ఒక జబ్బు మనిషిని ఇరవై నాలుగ్గంటలూ ఇంట్లో పెట్టుకోవటం ఎలా కుదురుతుంది?"

"అలా అంటే ఎలా? తప్పనిసరి అయినప్పుడు ఏదో నిర్ణయం తీసుకోవాలి. ఎవరినైనా అమ్మను చూసుకోటానికి పెట్టుకోవాలి. కావాలంటే ఆ ఖర్చులు నేనూ సగం భరిస్తాను" అన్నాను.

కాస్సేపు మాటరానట్టు నన్నే చూసింది. "చూడు సౌందర్యా! నువ్వు ఇంట్లోనే ఉంటావు కదా! అమ్మను నీ దగ్గరే పెట్టుకో! నువ్వే బాగా చూసుకోగలవు. ఇవన్నీ నా కంత తెలీదని నీకూ తెలుసు. మా ఇంట్లో ఉన్నవి మూడే బెడ్ రూములు. పిల్లలకొకటి. మా కొకటి. ఇంకొకటి స్టడీ కమ్ గెస్ట్ రూమ్. అమ్మను ఎక్కడ పెట్టుకోగలం? డ్రాయింగ్ రూమ్‌లో పెట్టుకోలేం కదా! విశ్వం బాగా సీనియర్ ఆఫీసర్ కదా! వచ్చే పోయే జనమూ ఎక్కువే."

నేనొక్కసారి కళ్లు మూసుకున్నాను. మాకు మాత్రం పెద్ద బంగళా ఎక్కడుంది? ఆ మాటకొస్తే చిన్న డ్రాయింగ్ రూమ్ పోగా ఉన్నది రెండు గదులే. ముగ్గురు ఆడపిల్లలు. పెద్దదానికి పదకొండు, రెండోపిల్లకు తొమ్మిది. మూడోదానికి ఏడు. పెద్దపిల్ల కుమారి మానసికంగా ఎదగని పిల్ల. అది ఎప్పటికీ మూడేళ్ల పాపే. దాన్ని ఒక్కక్షణం కనుమరుగవనిచ్చే ప్రశ్నే లేదు. ఎప్పుడు ఏ అవాంతరం తెస్తుందో అని భయం. అందరికీ దాని పరిస్థితి తెలీదు కదా! నవ్వేవాళ్లు, వింతగా చూసేవాళ్లు, ఏడిపించేవాళ్లు. బయటికి వెళ్తే మట్టి తింటుంది. వీధి కుక్కల తోకలు లాగుతుంది. అందుకే తన చెల్లెళ్లే తనకు అక్కలుగా ఉన్నారు.

మా ఖర్చులకూ కొదవేమీ లేదు. సంపాదించేవాడు మురళి ఒక్కడే. నేను గ్రాడ్యుయేషన్ వరకే చదివాను. బి.ఏ. అవగానే పెళ్లయింది. పిల్లలు, ఇంటి బాధ్యత. ఉద్యోగం చేయాలని ఏ నాడూ అనుకోలేదు. నా పరిస్థితుల్లో అది సాధ్యం కాదు. మురళికీ, నాకూ మధ్య మంచి అవగాహన ఉంది. ఎక్కువ తక్కువలేమీ లేవు. మాది డివిజన్ ఆఫ్ లేబర్. బయటి పనులు తనవి. ఇంటిపనులు నావి. ఇద్దరం కలిసి, సంప్రదించుకొని చేసే పనులు కొన్ని ఉంటాయి. మాకు పెద్దలిచ్చిన గొప్ప సంపదలూ లేవు. ఒక్కదాన్నీ ఇంత సంసారాన్ని లాక్కొస్తుంటే 'నువ్వు ఇంట్లోనే

ఉంటావుగా, అమ్మను నీ దగ్గరే పెట్టుకో' అంటోంది చెల్లెలు. తను ఎం.బి.ఏ. చేసింది. ప్రైవేటు ఫర్మ్‌లో ఉద్యోగం. భర్త ఇంకా పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. అయినా తన సమస్యలు తనవి.

ఆ రాత్రి మురళితో మాట్లాడాను. "మన వెనుక వరండా కవర్ చేసి గది చేసుకోవాలనుకొన్నాం కదా. ఆ పని పూర్తి చేసి అమ్మను ఇంటికి తీసుకొద్దాం" అన్నాడు. తన మంచి మనసు, సరైన నిర్ణయాలే నాకు కొండంత బలం. అందుకే మా పెద్ద పాపను కూడా చాలా సహజంగా తీసుకొన్నాను. దాని అదృష్టాన్నీ, నా అదృష్టాన్నీ ఎన్నడూ నిందించుకోలేదు. సమాజంలో న్యూనతాభావంతో కించపడనూ లేదు. కుమారికి ఎటువంటి బాధా తెలీకుండానే పెంచుతున్నాను. మరింత శ్రద్ధగా, ప్రేమతో పెంచుతున్నాను.

అమ్మను ఇంటికి తీసుకొచ్చాక తన పనుల కోసం ప్రత్యేకంగా ఒక మనిషిని పెట్టుకొన్నాను. ఆమెకు సేవ చెయ్యాలని ఉన్నా నా శక్తికి మించిన పని అని నాకు తెలుసు. అమ్మ స్వయంగా ఏమీ చేసుకోలేదు. నిత్యమూ ఒక మనిషి అవసరం ఉండనే ఉంది. మొదట పార్వతి, ఆ తర్వాత సుజాత, ఇప్పుడు రూప. ఎవరూ రెండు నెలలకు మించి చేయడం లేదు. వాళ్లకూ ఇటువంటి పనులు కష్టంగానే ఉంటాయి. ఉన్నప్పుడు వాళ్ల సాయంతో, లేనప్పుడు ఒక్కదానినే నెట్టుకొస్తున్నాను. జీవితం భారంగా ఉందని కూలబడలేము కదా!

"సరోజా కొంచెం ఉప్మా చేస్తాను తింటావా?" అన్నాను పైకి లేస్తూ.

"ఉప్మా సంగతి తర్వాత, అమ్మ ఇల్లు ఎవరి పేర వ్రాస్తుందో తేల్చుకుందామనే వచ్చాను. పెద్దకూతురు మహాసేవ చేస్తోందని నీకే ఇచ్చెయ్యదు కదా! అలా కుదరనే కుదరదు! అందులో సగం నాకూ చెందుతుంది. నాకు ఇల్లు అక్కరలేదు. నీవే తీసుకో. నా వాటా డబ్బు నాకిచ్చేయ్. మా ఇంటిదగ్గరే ఒక ఫ్లాటు అమ్మకానికి ఉంది. నాకు డబ్బవసరం ఎంతగానో వుంది. ఉన్నది ఇద్దరు పిల్లలు కదా! చెరో ఇల్లయినా ఏర్పాటు చెయ్యాలి కదా! మన అమ్మా, నాన్నా మనకు ఏం చేసినా చేయకపోయినా మన పిల్లల గురించి ఆలోచించకుండా ఉండలేం కదా!"

"అమ్మా నాన్నా ఏం చెయ్యాలి? వాళ్ల దగ్గర సంపదలు దాచుకుని మనకు లేకుండా చేశారా? వాళ్ల శక్తి కొద్దీ వాళ్లూ చేశారు."

ఇంతలో అమ్మ పిలిచినట్లయింది. నాతోపాటు సరోజిని లోపలికి వచ్చింది. "బెడ్‌పాన్ పెట్టావా? రూప ఎక్కడికి పోయింది?" అని అడిగింది అమ్మ.

"వాళ్లింటిదాకా వెళ్లిందమ్మా వచ్చేస్తుంది. బెడ్‌పాన్ నేను పెట్టానుండు."

"బాగున్నావా అమ్మా?" అంది సరోజిని. ఊరికే అలా తల ఊపింది అమ్మ.

సరోజిని అవతలికి వెళ్లింది.

నేను బెడ్‌పాన్ పెట్టి, తీసి, ఖాళీ చేసి, కడిగి, అమ్మ పక్కబట్టలు సర్ది, చేతులు కడుక్కొని వచ్చాను.

"అబ్బ, ముఖం బాగా వాచిపోయింది. డాక్టరును పిలిపించలేకపోయావా?" అంది సరోజిని.

"చెప్పాను కదా. నిన్న ఆస్పత్రికి వెళ్తే ఏవో మందులిచ్చి వెనక్కి పంపారు."

గొంతు తగ్గించి "ఇక ఉంటుందన్న నమ్మకం లేదు" అంది.

ఆ సంగతి అందరికీ తెలుసు. అమ్మకూ తెలుసు. అందుకే తల ఊపి ఊరుకున్నాను.

మళ్లీ కాస్సేపటికి లోపలికి వెళ్లాం. "నిన్ను చూద్దామనే వచ్చానమ్మా. ఆఫీసులో పనుంది కాని నిన్ను చూసి చాలా రోజులయిందని వచ్చాను. ఫోనులో సౌందర్యతో మాట్లాడుతూనే ఉంటాను. ఆయన కూడా నీ గురించి ఎప్పుడూ అడుగుతూ ఉంటారు."

అమ్మ తల ఊపింది. పడుకొని మమ్మల్నిద్దరినీ చూస్తోంది.

"కాస్సేపు కూర్చుంటావా?" అన్నాను. తల ఊపింది.

"కాస్త సాయం చెయ్యి సరోజా. ఆ దిండ్లు అలా సర్దు."

ఇంతలో బెల్ మోగింది. సరోజిని తలుపు తియ్యటానికి వెళ్లింది. రూప వచ్చింది. ఇద్దరం కలిసి అమ్మను కూర్చోబెట్టాం.

"టీ చేసి తెచ్చేదా?" అంది రూప. అమ్మ సరేనంది. మేమిద్దరం అమ్మకెదురుగా కూర్చున్నాం.

"ఎంత బాధపడుతున్నావో ఏమో అమ్మా! నిన్ను చూస్తే మేమే తట్టుకోలేకుండా ఉన్నాం" అంది సరోజిని.

"పిల్లలు బాగున్నారా?" అంది అమ్మ.

"అందరూ బాగున్నారమ్మా. పిల్లలు పెద్ద వాళ్లవుతున్నారు. వాళ్ల చదువులూ, అవసరాలు, ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయి. ఏవో మా బాధలు మావి."

అమ్మ తల ఊపింది.

“అన్నీ తెలిసినదానివి. ఇంటి గురించి ఆలోచించావా అమ్మా. లాయర్ని ఎవరినైనా పిలిపించేదా?” అని అడిగింది సరోజిని.

అమ్మ వద్దన్నట్టు తల ఊపింది.

“పోనీలేమ్మా విల్లు రాయకపోయినా పర్వాలేదు. నీ బిడ్డలం ఉన్నది మేమిద్దరమే లేదా మాకు రాక ఎక్కడికి పోతుంది?”

రూప టీ తెచ్చింది. “వీళ్లిద్దరూ బయటే టీ తాగుతారు. అక్కడికే తీసుకెళ్ళు” అంది అమ్మ.

అమ్మకు కప్పు అందించాను. “ఆ ఇల్లు నా పేరున ఉంది సరోజా. నాకు ఇష్టం వచ్చిన వాళ్లకు రాయగలను” అంది అమ్మ.

“అంటే సౌందర్యకా? అలా చేశావంటే నేను కోర్టుకైనా వెళ్లి నా హక్కు పొందుతాను. నా దగ్గర నంగిమాటలేం లేవు. అన్నీ ముఖాన్నే అనేస్తాను” అంది సరోజిని తీవ్రంగా.

“మీరిక వెళ్లండి. నాకు ఆయాసంగా ఉంది” అని పడుకోబోయింది అమ్మ. నేను తనకు సాయం చేస్తుండగానే విసవిసా బయటకి వచ్చేసింది సరోజిని. అమ్మ నన్ను కూడా పొమ్మన్నట్టు చెయ్యి ఊపింది.

“మొత్తానికి అమ్మను బాగానే బుట్టలో పెట్టావు. అయినా నేను వదిలిపెట్టను” అంది సరోజిని టీ తీసుకుంటూ.

“నాకు ఈ విషయాలేమీ తెలీదు సరోజా. అమ్మతో ఎన్నడూ ఇవి మాట్లాడలేదు” అని నేనన్నా తను నమ్మలేదు.

ఆ రాత్రి అమ్మ మురళిని పిలిచింది. “నాయనా, ఆ ఇంటిని అమ్మేస్తున్నాను. కొంచెం ఆ ఏర్పాట్లు త్వరగా చేయి” అని చెప్పింది.

“ఇప్పుడవన్నీ ఎందుకండీ. తర్వాత చూసుకోవచ్చు” అన్నాడు మురళి.

“లేదు బాబూ. నేనెన్నాళ్లో బతకను. నాకటువంటి భ్రమా లేదు, మోహమూ లేదు. కర్మఫలం అనుభవిస్తున్నానంతే. నేనుండగానే ఆ ఇంటి విషయం తేల్చాలి.”

ఆ రాత్రి అమ్మ గురించి ఆలోచిస్తూ పడుకొన్నాను. వృద్ధాప్యం ఎలా ఉంటుందో, ఎటువంటి జబ్బులు తెస్తుందో ఎవరూ ముందే ఊహించరు. వచ్చినప్పుడు గుండె నిబ్బరంతో ఎదుర్కొనడంతప్ప చేయగలిగిందేమీలేదు. అప్పుడు ఎవరో ఒకరు తోడుంటే కాస్త సంతృప్తి. మా చిన్నతనంలో అమ్మ ఎంతెంత చేసింది! ఎంత సహజంగా చేసింది! అమ్మవారు పోసినా, ఒళ్లంతా కురుపులైనా, అతిసారంతో

పడకలోనే విసర్జన చేసినా అసహ్యించుకొందా? ఛీత్కరించిందా? కోప్పడిందా? విసుక్కుందా? ప్రశాంతవదనం, ప్రేమజ్యోతిలా తళుక్కుమంటున్న ముక్కు పుడక, ఇవే మా జ్ఞాపకాలు. అప్పుడు ఎవరికి ఎవరు బరువయ్యారు? మా అమ్మను ఇప్పుడు నిస్సహాయ స్థితిలో ఆదుకుంటే అదేమంత ఘనకార్యం? దానికి ప్రతిఫలం కావాలా? ఆమె డబ్బు మాకెందుకు?

మరుసటి రోజు ఉదయం అమ్మతో ఆ మాటే అన్నాను. మురళి కూడా నాతోనే ఉన్నాడు. "లేదు సౌందర్యా. ఇది ప్రతిఫలం కాదు. మనిషికీ, మనిషికీ మధ్య ఉన్న అనుబంధాన్ని డబ్బుతో తూచలేము. నేనిస్తున్నది నీకు కాదు. నీ పిల్లలకు. ముఖ్యంగా కుమారికి. వాళ్ల భవిష్యత్తుకు కాస్త చేయూత అంతే" అంది అమ్మ.

మురళి అన్నాడు. "మీరు పిల్లలకిచ్చినా సౌందర్యకిచ్చినట్లే అవుతుంది. సరోజినిని ఎలా కాదనగలరు? అది న్యాయం కూడా కాదు."

అంత నీరసంలోనూ అమ్మ నవ్వింది. "నేను తల్లినే కదా. నా బిడ్డల అవసరం నాకు తెలీదా? సరోజకు చిన్నప్పటినుండీ తన కడుపు ఆకలి తనకు తెలీదు. తినటం తన అలవాటు. కడుపు నిండటంతో ప్రమేయం లేదు. ఎప్పుడూ అజీర్ణమే. బలవంతాన తిండి మాన్పించేదాన్ని. ఇప్పుడూ అంతే అనుకోండి." కొంచెం ఆగి ఊపిరి తీసుకుంది. "సమాజంలో నిలబడటానికి ఆడపిల్లలకు ఆర్థిక బలం కొండంత బలాన్నిస్తుంది. నాకు తోచింది నేను చేస్తున్నానంతే." నీరసంగా కళ్లు మూసుకుంది అమ్మ.

ఆంధ్రప్రభ వారపత్రిక

11 ఆగస్టు 2001

కథా నిలయం
శ్రీకాకుళం